కథానిక :

# మీరూ, నేనూ, మాఘమ్

★

శ్రీ బుచ్చిబాబు

ఏదో వొక కథ అల్లేటందుకు కావల్సిన అనుభవాన్ని లాగకుండా ఏవ్యక్తితోనూ గంట ప్రసంగించలేను—అన్నాడు ప్రసిద్ధ కథారచయిత సామర్‌సెట్ మాఘమ్. అంతటి పరిశీలనా బలం, సూక్ష్మబుద్ధీ ఆయనలో వున్నాయన్న విషయం, ఆయన కథలు చాలా చదివా కాబట్టి నేను సంశయించను కాని పైవాక్యం ప్రగల్భంలా తోస్తుంది. ఆయన ప్రపంచం అంతా తిరిగివొచ్చాడు. వయస్సు దాదాపు డెబ్బైయేడేళ్లు. జీవితకాలంలో రోజుకి వొక కొత్తవ్యక్తి చొప్పున కలుసుకున్నా, షుమారు యిరవైయేడు వేల మంది వ్యక్తులతో వొక గంటేనా ప్రసంగించివుండాలి. రోజల్లా పరిచయం యిచ్చిన వారి సంఖ్య కనీసం, వెయ్యిఅనుకున్నా, ఆయన వ్రాసిన కథల సంఖ్య వెయ్యికాదు.

“నేను, గంట పరిచయం గలవ్యక్తులెందరుంటే అన్ని కథలూ వ్రాయగలను కాని, దానికి నాజీవితం చాలదు.” అని మాఘమ్ సమాధానం యివ్వొచ్చు. విలువగల ఐదొందల కథలు వ్రాయడానికి జీవితకాలం సరిపడుతుంది. “నేను విలువగల కథలు వ్రాస్తానని హామీ యివ్వలేదు” అని మాఘమ్ అంటే మనం బడాయి ప్రకర్షపై దాడి చెయ్యక్కర్లేదు.

మాఘమ్ ప్రశంస తేవడానికి మరేం కారణం లేదు. ఒక సంవత్సరం పాటు పరిశీలించే అవకాశం వున్నా మాఘమ్ పద్మావతిని గురించి ఏ కథనీ అల్లేటందుకు తగినంత వొస్తువును సేకరించలేడని ధాటీగా చెప్పగలను. “ఏదో అసాధారణమైన వొక్క చూపు. వొక చేష్ట, మాటలో మార్దవం, అప్రయత్నంగా వెలువడిన వాక్యంలో పద జాలం, విచారంతో వొదిగిన పెదవుల సొంపు, నవ్వుస్ఫురింప జేసే కనురెప్పల తళతళ—వీటిని గ్రహించడానికి గంటచాలు; వీటిల్లోంచే కథని అల్లగలను.” అంటాడు మాఘమ్. ఇంతటి నిస్సారమైన, అస్పష్టమైన తాత్కాలిక సూచనల నాధారంచేసుకుని అల్లిన కథ పోకడ, పొగమంచుని పటాపంచలు చేసేయత్నంగా పరిణమించి చివరికి రచయిత మనస్తత్వమే కథకి వొస్తువుగా తయారవొచ్చు. నిర్ణయించిన కథావొస్తువు పరిణామం సరైనదని వొప్పుకున్నా ఏది అసాధారణమైన చూపో, ఏది అప్రయత్నంగా వెలువడిన వాక్యమో, గంటలో నిర్ణయించడం అసాధ్యమనుకుంటాను. అది పదేళ్లపాటు కాపరంచేసిన భర్తకిసాధ్యం కావొచ్చునేమో. అప్పుడుకూడా, తన విజ్ఞానాన్ని భార్యముందు ప్రకటించకూడదు. ప్రకటించిన పక్షంలో దాంపత్యంలో తికమకలు రాక మానవు. ఆ తికమకల ప్రాబల్యం నిత్యవాతావరణంలో బహిర్గతమైనప్పుడే, మాఘమ్‌లాంటి రచయితలకు కథావొస్తువు దొరకొచ్చు. ఆ భాగ్యం గంటలో లభిస్తుందనుకోను.

దగ్గరదగ్గరగా మూడేళ్లు పద్మావతి సంసారాన్ని పరిశీలించే అవకాశం నాకుకల్గినా మచ్చుకి ముచ్చటించేటందుకు వొక్క తికమక కూడా నా దృష్టిలోకి రాలేదు. నేను పద్మావతిని గురించి వ్రాయడానికి కూడా యీరకం సాధారణత్వమే. కనీసం వ్రాసినప్పుడేనా, వొరకం అల్లిక, స్ఫుటమైన పొందిక అసాధారణత్వాన్ని అలవర్చుకుంటాయేమో చూద్దామనే వ్రాయడానికి సంకల్పించాను. ఈసంకల్పంలో నాకు చదువరి తోడ్పాటు ఎంతో అవసరం. చదువరి అభిప్రాయాలని, అనుభవాలనీ, నాతో పంచుకోమనడం లేదు. కాని నాకూ చదువరికీ, సంఘాన్ని గురించి—నిర్వివాదమైన ముఖ్య విషయాలపై ఏకీభావం వుండాలి. ఉభయులం, సాంప్రదాయాన్ని ఆమోదించాలి. ఆచారాన్ని, సాంఘిక ప్రయోజనాన్ని తృణీకరించినప్పుడు, ఆ తృణీకారం, చేష్టలోకాని, మాటలో

కాని వ్యక్తమై, ఏదోరకమైన వొత్తిడి, అలజడి కలిగించినప్పుడు, అసాధారణ పరిస్థితి ఏర్పడి, వ్యక్తిగత జీవితంలో వోరకం సమస్య బైలుదేరి మాఘుమ్‌లాంటి రచయితలు విలువగల కథలు వ్రాసే అవకాశాలు సిద్ధిస్తాయని, వుభయులం అంగీకరించాలి. కుటుంబ సాంప్రదాయానికీ, సాంఘిక నియమానికీ విరుద్ధమైన ప్రవర్తన అసాధారణమైనదని వొప్పుకుంటే నేనూ, చదువరీ, ఆ ప్రవర్తనకి విలువలు కట్టడంలో ఏకీభవించ నక్కర్లేదు. అట్టిప్రవర్తనకి కారకులైన వ్యక్తులపై ద్వేషంగాని, సానుభూతిగాని ప్రబలంగా వుండొచ్చు. చదువరిలో నాలోవున్న సానుభూతిని రేకెత్తించగల్గితే, యిప్పుడు సాగుతున్న రచన నిష్ప్రయోజనం కాదని తృప్తిపడతాను.

కారణం ఏమిటంటే, సామాన్యంగా మనలో చాలామంది ముఖ్య సమస్యలని స్వతంత్రించి ఎదుర్కోము. వాటి పరిష్కారం యితరులకి వొదిలేస్తాము. అల్లాగే వ్యక్తులగురించి మనకి స్పష్టమైన అభిప్రాయంగాని, 'అనుభూతి' గాని వుండదు. ద్వేషించం; సానుభూతి ప్రకటించం; అసలు వారిని గుర్తించం.

గుర్తించి, విలువకట్టేవాళ్లు ఎవరేనా వుంటే వారిని మెచ్చుకుంటాం. అందుకనే కథలకి యీ రోజుల్లో అంత ప్రచారంవుంది. కథలలో విలువలుకట్టే యత్నం కాస్తోకూస్తో, జరుగుతుంది. సమస్యలను ఎదుర్కొనే 'యితరులు', విలువలుకట్టే రచయితలు లేనప్పుడు, సంప్రదాయం వేళ్లు పాతుకుంటుంది. సంస్కృతి, కళ, లోపలకుళ్లి, పైకి ప్రమాదకరంగా ఘనీభవిస్తాయి. అంతటితో ఆ నాగరికత చస్తుంది.

వ్యక్తులంతా, నాగరికతని రక్షించడానికీ, సంస్కృతినీ కళలనీ పెంపొందించడానికీ, సాంప్రదాయంపై విప్లవంచేసి, అసాధారణ వ్యక్తులై స్థిరత్వాన్ని నిర్మూలంచేసే విధ్వంసక శక్తులుగా మారాలని వాదించడం లేదు నేను.

ప్రతియుగంలోనూ కొందరు అల్లాంటివారు వుంటూనే వుంటారు. మిగత వారందరూ, సంఘాన్ని, సంప్రదాయాన్నీ, నిలబెడతారు.

పద్మావతి, యిల్లాంటి వారిలోకి చేరుతుందను కుంటాను.

నే ఎరుగున్నప్పుడు, పద్మావతికి వయస్సు యించుమించు నలభై. భర్త డాక్టరు. ఏడెనిమిదేళ్లు ఆమెకంటె పెద్ద. వారికి ముగ్గురు ఆడపిల్లలు, యిద్దరు మొగపిల్లలు. పెద్దమ్మాయికి పదహారో యేడు; చివరివాడికి రెండో యేడు. భర్త నాగభూషణం ప్రాక్టీస్ కూడా, మరీమంచిది కాకపోయినా, మంచిదే. అతనికి వో పదెకరాల భూమి కూడావుంది. వార్ని గురించి చెప్పేటందుకు నాకింకేమీ కనబడ లేదు.

సామాన్య వ్యక్తులను గురించి వ్రాద్దామని సంకల్పించిన రచయితలు తమ కథల్లో నాయికా నాయకులను అసాధారణ వ్యక్తులుగా మార్చేటందుకు వింతయత్నాలు చేస్తుంటారు మాఘుమ్ కథలన్నింటిలోనూ, నాయిక చాలా అందమైనది. పూర్వపు రచయితలు, వ్యక్తివర్ణనంతా తైలచిత్రంకింద, వొకేసారి కొన్ని పుటలలో గుచ్చెత్తి వ్రాసేస్తారు. మాఘుమ్ అల్లాకాదు; చమత్కారంగా వోపుటలో, కళ్లని, మరోచోట ముక్కుని, వొకప్పుడు ఛలాకీని, మరొకప్పుడు, కంఠాన్ని, మెరపుల్లా ప్రదర్శించి, చివరికి అతను, మనం, యింతటి అందమైన స్త్రీని కలుసుకునే భాగ్యం ఈ కథమూలంగా కలిగిందనుకునే భ్రమని కలగచేస్తాడు. ఈ చమత్కారాన్ని మెచ్చుకుందాం, కాని యిది అన్యాయమని వొప్పుకోవాలి. అంత అందమైన స్త్రీ గనకైతే సామాన్యస్త్రీ కాలేదు, ఉన్నత సమాజానికి చెందిన అపూర్వ వ్యక్తి అవుతుంది; అల్లాంటివారి పరిచయం రచయితకి సాధ్యమే కాదంటాను. ఇక పురుషులూ, అంతే; నాయకులు, బలశాలులలో, ప్రతిభాశాలులలో, కళావేత్తలలో, రచయితలలో, ఎందుకూ పనికిరాని అందమైన వాజమ్మలలో అయివుండాలి. సామాన్య వ్యక్తుల అసాధారణత్వానికి రచయిత అసాధారణత్వమే శరణ్యం కాబోలు. రచయితలూ, చదువరులూ, ప్రజాస్వామ్యంలో అధిక సంఖ్యాకులు సామాన్యులవడం మూలాన యీ ఆత్మవంచన పరస్పరం—అందుచేత విమర్శనీయం కాదు.

పద్మావతి అనాకారి అనను. మనం రైళ్లలో, ట్రాముల్లో, రోడ్లమీద, నిత్యమూ చూస్తున్న అనేకమంది స్త్రీలల్లో ఆమె వొకతి. ఆమెని చూస్తాం-

మన దృష్టిలోపడి నప్పుడు, పెళ్ళింతర్వాత, వెనక్కి. తిరిగి చూడడం. కళ్ళున్నా యికనక చూస్తాయి; చూసి నట్లు మనం గుర్తించక పోవడం కూడా అసంభవం కాదు. యవ్వనం గడిచిపోయిన స్త్రీని వర్ణించేటం దుకు మాఘమ్ వొక చమత్కారం చూపుతాడు: అది, ఆమె యిరవైయేండ్లకింద ఎట్లా వుండేదో వూహించడం; లేకపోతే అట్లా చూసినవ్యక్తిని నాయకుణ్ణిగా మన నెత్తిని రుద్దటం.

మరెవ్వరూ లేరుగనుక, మనకి నాయకుడు నాగభూషణమే. అతని డిస్పెన్సరీ యింట్లో లేదు. ఆవీధిలోనే మరోయింట్లో.

సూటు వేస్తుంటాడు; పంచి, లాల్చీ వేస్తుంటాడు. ఇంట్లో పైజామా వేస్తుంటాడు. వయస్సు మళ్ళినవారు లావుగావుంటే, ఆ లావుని గురించి చెప్పకోము. భార్యకూడా అంత లావుగావుంటే, అసలే చెప్పకోము. పద్మావతీ, నాగభూషణం, అట్లాంటివారే. జుట్టు ఇద్దరికీ సమంగా నెరుస్తోంది; సమంగా పల్చబడు తోందన్నాకూడా తప్పలేదు. ఇద్దరూ అనాకారులు గారు. ఇట్లా చెప్పడంవల్లపాఠకు లకి ఈ వ్యక్తులు వర్ణిత మయ్యారనుకోడం లేదు. వూహించుకుని, సహకరించమని ప్రథమంలో నే కోరాను.

ఆ యింట్లో మరో వ్యక్తివున్నాడు. అతనిపేరు వేలాయుధం. మొదట డిస్పెన్సరీలోవుంటూ, తర వాత యింటినౌకరుగా కుదురుకున్నాడు. అతనికి సంసారం, చుట్టుబంధులూ వుండేమో నాకు తెలవదు. అతనివయస్సు యాభైపైన.

ఇహ నేను మిగిలాను. మాఘమ్ కథలలో 'నేను' అని వ్రాశినవి చాలా వున్నాయి. అందులో 'నేను' ఎంతవరకూ అసలు మాఘమో, కల్పితవ్యక్తో, ఎవ్వరికీ, తుదకు మాఘమ్‌కి కూడా తెలియదు. ఇందులో నేనూ అంతే. ఆరోజుల్లో మెడికల్ కాలేజీలో చదువుకుంటున్నా. నాగభూషణంగారింటి రెండో వాటాలో కాపరం వుండేవాణ్ణి. ఒక సంవత్సరం, హోటల్లోతింటూ వొంటిగా వున్నాను. మరోసంవ త్సరం, మా పిన్నమ్మతో వంటతతంగం పెట్టుకుని చదువుకునేవాణ్ణి.

నాగభూషణంగారు డాక్టరవడమే, ఆయనకీ నాకూ కొంత అన్యోన్యం ఏర్పడ్డానికి కారణమేమో ననిపిస్తుంది. ఆయన మనస్తత్వం నాకు పూర్తిగా బోధపడిన ట్లనిపించేది ఎందుకో. కాని పద్మావతి గార్ని గురించి నాకేమీ తెలీనట్లుండేది. లేకపోతే ఆవిడలో కొంత చీకటి, మసగ, 'మిస్టరీ' వుందను కుంటే, నాకు తృప్తిగా వుండేదో తెలీదు. ఆవిడ అర్థంకాకపోడంలో అసాధారణత్వం వుందని యిత రులు అనుకోవాలని, ఆమె అనుకునేదా? లేక అట్లా అనుకుంటే ఆవిడ తృప్తిపడి, మరింత అర్థం కాకుండా వుంటూ, అర్థంచేసుకోండని సవాలు చేస్తూ మసగని మరింత చీకటిచేసి, దగాలో తన వ్యక్తిత్వాన్ని సాధించిందా? ఏమో—నాకిదంతా గందరగోళంగా వుంది. పాఠకుడి స్వానుభవానికి విడిచిపెడతా.

కాని వొక్కవిషయం, యిప్పుడిప్పుడు జ్ఞప్తి కొస్తుంది. పద్మావతి హృదయంలో వెలుగు సోకని రహస్యమందిరాలు, ఇంద్రియాలు శోధించని కోణా లున్నాయనీ అనుకున్నది నేనొక్కణ్ణేకాను. నాగ భూషణంగారు కూడా, యీ విధమైన అంతర్యం, భార్యని గురించి వుందన్నట్లుగా వుంటారు.

మా అన్యోన్యానికి యిదొక కారణం కావొచ్చు.

అన్యోన్యం, మాటల్లో ప్రదర్శితమౌతుంది.

కాని మా స్నేహంలో మాటలకి ఎక్కువ తావు లేదు. ఎప్పుడేనా వారి ముందుగదిలో కల్లి పేపరు చదివి ముచ్చటించడం, ఆయన ఏదేనా చిత్రమైన కేస్ గురించి చెప్తుంటే వినడం-అంతే. అదేనా శనాది వారాల్లో. మిగతా రోజుల్లో ఆయన డిస్పెన్స రీలో, నేను కాలేజీలో.

వారింటికి అప్పుడప్పుడు, ఆయన తాలూకు బంధువులో, ఆవిడ తాలూకు బంధువులో వొచ్చి పోతుండేవారు. ఆ సందర్భాలలో వారిలో కుర్ర కారుతో నాకు పరిచయం కలిగేది.

పై గదిలో చోటుచాలక వారు నా గదిలో నే వుంటుండేవారు. వాళ్ళలో రాఘవరావుతో—పద్మావతి తమ్ముడు—నాకు ఎక్కువ పరిచయం కూడా కలిగింది. అతను అక్కయ్యా బావలని గురించి ప్రస్తావిస్తుండేవాడు—మామూలు గొడవలే. నాకు ఒక్కటీ విశేషం కనిపించలేదు.

శనాదివారాల్లో, పద్మావతిగారు, నన్ను హోటలికి వెళ్లనిచ్చేది కాదు. వారింట్లోనే భోజనం, కాఫీలు. నాగభూషణంగారు కేసులు చూసుకొని, వొక్కొక్కరోజున యింటికిరావడం ఆలశ్యమయ్యేది. పిల్లలందరూ పడుకునేవారు. పద్మావతిగారూ, నేనూ చాలాసేపు కబుర్లు చెప్పుకునేవాళ్లం.

ఒకటిరెండు విషయాలు నాకు జ్ఞాపకం వున్నాయి. ఆవిడ తరుచు, తన పుట్టింటివారి స్తోత్రం సాగించేది. పెద్దక్క కోయంబత్తూర్‌లో వుంటూంది: ఆవిడ భర్త పెద్ద ఎంజినీరు; ఎనిమిదొందలు జీతం. కారూ అదీవుంది. అన్నగారు పెంపకం—సాలికి పదివేలు తెచ్చే ఆస్తికి ఆసామీ. రెండో అప్పగారి భర్త జడ్జి. మూడోతమ్ముడికి బర్మాలో వుద్యోగం చెల్లెలు మొగుడు, డి. యి. వో; ఒకప్పగారి భర్త, యిటీవలెనే చనిపోయ్యాడు. పబ్లిక్ ప్రోసిక్యూటర్‌గా వుండేవారుట. మొత్తమ్మీద ఆవిడ బంధుకోటి అంతా పెద్ద హోదాలో వుంటున్నవారే; మనస్సుకి నొప్పి కలగకపోతే, ఆంధ్రదేశం అంతా, బొమ్మజెముడు కంపలా, ఆవిడ బంధుకోటి వ్యాప్తి చెందారా అన బుద్ధేస్తుంది.

రెండోసంవత్సరం—నేను కాపరం పెట్టిన ఏడు—కూడా వారిని గురించి చెప్పుకోదగ్గ విశేషం వొక్కటీ నాదృష్టిలో పడలేదు. రెండో అమ్మాయి రజస్వలకావడం, నాలుగోవాడి వొడుగు, రెండో అమ్మాయికి టైఫాయిడొచ్చి, నిమ్మళించడం—అవే విశేషాలు. అప్పుడప్పుడు, పద్మావతికి, వాళ్ల పెద్దమ్మాయిని నాకిచ్చి వివాహం చేద్దామని వుండేదా అని,క్షణం స్ఫురించేది. కాని, పద్మావతిగారి సంభాషణలవల్ల నా అపోహలకి తావులేకుండా పోయింది. అసలు 'మా అమ్మాయి పెండ్లేచేసుకోదు.' అంది ఖచ్చితంగా- తనని మళ్ళా జీవించమంటే, పెండ్లి చేసుకోకుండా వుండి వుందునన్న 'ధ్వని' ఆవాక్యంలోవుందని నా అనుమానం.

ఓసారి ఏదో మాట సందర్భంలో నేను యీ విషయం నాగభూషణం గారితో అనేశాను. ఆయన నవ్వి యిల్లా అన్నారు:

"అవునవును, చేసుకోదు..."

"మీ అభిప్రాయం కూడా అదేనా?" అన్నాను.

"చేసుకోకపోవడం అమ్మాయి హక్కు, చెయ్యడం నా బాధ్యత."

"నా కర్థంకావడం లేదు."

"పద్మావతి చలాయించిన హక్కుని, అమ్మాయి విషయంలో బాధ్యతకింద మారుస్తోంది."

"అస లర్థం కావడం లేదండోయ్" అన్నాను.

"నీ విషయం చెబుదూ. నువ్వింకా ఎందుకు చేసుకోలేదు?"

ఆయన ధోరణి తప్పించడానికి యత్నిస్తున్నట్లనిపించి, నేనూ మరోవిషయంలోకి సంభాషణ దింపేశాను.

నాగభూషణంగారు, పిల్లలూ, నేనూ-అందరం అప్పుడప్పుడు సినిమాకి వెడుతుండేవాళ్లం. మాతో ఎప్పుడూ పద్మావతిగారు వొచ్చేవారుకారు. ఎందుకో నాకు తెలీదు. ఒకరోజున అడిగేశాను. ఆవిడనవ్వింది. నాకోపం వొచ్చింది. ఆవిడ సినిమా చూడకపోతే, ఆంధ్రదేశానికేదో ముప్పు వాటిల్లినట్లు! శిఖరంపై నవ్వితే ప్రతిధ్వని వినిపించదుగా!

"కాలక్షేపానికి, సినిమాలూ, నాటకాలూ అంటూ లేకపోతే, జీవితంపై మొహం మొత్తుతుందంటారుకదా, మీరు సినిమాల కెందుకెళ్లరండీ?" అని అడిగాను.

"ఇంట్లో సినిమా చాలకనా?" అంది. ఇంట్లో సినిమా ఏమిటో నా కప్పుడూ అర్థంకాలేదు. యిప్పుడూ కాలేదు.

"అంటే?"

"ఏంచెప్పను. ఇదంతా వొక సినిమాలాగుంది నాకు" అన్నది.

పద్మావతిగారికి సంసారంపై కలిగిన విముఖత్వానికి తగిన ఆధారం కనబల్లేదు. పరిస్థితులకు మించిన వుద్రేకం, ఎప్పటికి వొటిదే అని నా నమ్మకం.

మరోసారి మూడోవాడికి జబ్బుచేసింది. నేను, నాగభూషణంగారు, కాంపౌండర్లు కుర్రాడిని కనిపెట్టుకునే వుండేవాళ్లం. పద్మావతిగారికి మాత్రం రోజుల్లా వంటింట్లోనే సరిపోయ్యేది. అబ్బాయి, ఎల్లా వున్నాడో చూడ్డానికి ఆవిడకి తీరదేకాదు.

నేను, ఆ నాలుగురోజులూ అయ్యర్ని వొంటకి పిలిపిస్తానంటే ఆవిడ వొప్పుకోలేదు. అబ్బాయి విషయం ఆవిడ ఆదుర్దా చూపకపోవడం కాస్త ఆశ్చర్యం వేసింది.

"పిల్లలన్న తర్వాత జబ్బులు చెయ్యకుండా వుంటయ్యా—డాక్టరుగారి పిల్లలకి జబ్బులకేం కొదవ!" అంది నవ్వుతూ నే. నేనప్పట్లో లోలోన విసుక్కున్నానుకూడా. ఈ సంతానం తనకి పుట్టనట్లు మాట్లాడుతుందేం మహా! అబ్బాయికి కొంచం తగ్గింతర్వాత, నే నన్నాను:

"మీరు చాలా పాటుపడుతున్నారు."

"ఏపాటు తప్పినా సాపాటు తప్పదుగా!" అంటూ నవ్వింది.

సాధారణంగా తల్లులు, అబ్బాయికి కాస్తంత నలతగావుంటే కంట నీరెట్టుకుంటారు. పద్మావతి విముఖత్వం ఆలోచిస్తే, యిప్పుడు అసాధారణంగా కనిపిస్తోంది. కథలు వ్రాసేవారికి, చదివేవారికీ, వ్యక్తులపై గురి, నమ్మకం కలగవు. అందరూ పాత్రలుగా నటిస్తున్నట్లు కనిపిస్తారు. వాళ్ల మాటలు నమ్మలేం. మనమీద మనకే గురి తప్పినప్పుడు, యితరులమీద తప్పడంలో ఆశ్చర్యం ఏముంది? ఓవేళ, నిజంగా ఆవిడ ఆవేదన చూపి, రాగాలెట్టినా, అదంతా నట నేనని, నేనూ, మీరూ సామర్సెట్ మాఘం కూడా అనెయ్యడానికి జంకం.

స్ఫురణకొచ్చే సంభాషణలు నాకింకేమీ కనబడటంలేదు. ఓ వేసంగిలో నాగభూషణంగారు, భార్యా, పిల్లలతో వాళ్ల వూరెళ్లారు. నేనూ, వేలాయుధం పట్నంలో నే వుండిపోయ్యాం. అతని దగ్గర నుంచి కొత్త విషయాలని గుంజుదామనుకు నేవాణ్ణి. ఆవిడ చాలామంచిదని, అంతవోర్పు, వోపిగ దయ దాక్షిణ్యాం, యింకెవ్వరికీ వుండవనీ అతని మాటలవల్ల తేలింది. పెట్టుపోతల విషయంలో ఆవిడ అన్నపూర్ణే. భార్యా, భర్త ఒక్కసారి తమాషాకైనా, తగవులాడుకున్నట్లు లేదు. అంతటి అన్యోన్యం వుంది వారి దాంపత్యంలో. నిజానికి అంతమంచితనం నమ్మడం కష్టమే ననుకుంటా.

అతిమంచివాళ్లు నాకు గిట్టరు. మరీ అందమైన స్త్రీలంటే నాకు భయం. చాలా తెలివైనవాడన్నా, అతిబలశాలన్నా, ఎక్కువ ఆరోగ్యవంతులన్నా, మరీ ధనికులన్నా, నాకు తలనొప్పి. దీనికి కారణం నాకివేవీ లేవుగనక, వున్నవారంటే యీర్ష్యని, మీరూ, సామర్సెట్ మాఘం ఏకమై అంటే, నే కాదనను. అనుకూల దాంపత్యాన్ని భంగం చెయ్యడానికి సంఘం సదా యత్నాలు ఎందుకు చేస్తుందో నాకర్థమవుతుంది!

పద్మావతి, నాగభూషణం—వారి జీవితంలో, ఏదో తిరకాసుందని నాకు తెలుసు. అదేవిటో మట్టుకు తెలీదు.

ఒకరోజున స్నానానికని నేను కుళాయిదగ్గర కెళ్లాను. సబ్బుబిళ్ల పెట్టిపక్కనవున్న పళ్లవరసను చూసి అదిరిపడ్డాను. పద్మావతిగార్ని అడిగాను.

"అవా—అ పళ్లు డాక్టర్ గారివే" అంది.

"నే నెప్పుడూ గమనించ నేలేదు స్మాండి" అన్నాను.

"డాక్టర్లకి, డాక్టర్లని గురించేం తెలుస్తుంది!" అన్నది.

కొంచెం పరీక్షగా, పద్మావతిగారి పళ్లవరసని అప్పుడు చూశాను. నిజంగా చాలా అందమైన పళ్లవరస. అసలు ఆవిడలో వున్న 'కళ', అందం, ఆ పళ్లల్లో నే వుందని మాఘం అనును.

వేలాయుధం చెప్పాడు. నాగభూషణం గారి కిందిపళ్ళలో వొకటి వంకరగా, ఎత్తుగా వుండేదిట, ఆయనదాన్ని కెలికి, లాగి, లాగి, చివరకి, వరసంతా పీకించేసుకుని, కొత్తపళ్లు తగిలించుకొన్నాడుట—కొన్నేళ్లక్రితం. ఇది విన్ననాటినుండీ, నా పళ్లపై, శ్రద్ధాభక్తు లెక్కువైనాయి.

పద్మావతిగారికి జీవితంపై వున్న విముఖత్వానికి, తన అందమైన పళ్లవరసని, మిమ్మల్ని అనుకోమన డంలేదు. డాక్టర్ చదువువల్ల, నాకు మనుషుల అస్తిపంజరాల అమరికని తప్ప, కండనీ, చర్మం సొంపునీ చూసి మురిసిపోవడం అలవాటులేదు. అస్తిపంజరానికి, నిజంగా పరిపూర్ణమైన వికృతాన్ని ఆపాదించేది, పళ్లవరస కాక మరేమిటి!

నేను శెలవలకి యింటికెళ్లినప్పుడు వారి పెద్దమ్మాయి పెండ్లి జరిగింది. తిరిగి వొచ్చాక పద్మావతి గార్ని అడిగాను.

"అమ్మాయికి పెండ్లే చెయ్యమన్నారు?"

"నా యిష్టమే వుంది—అంతా డాక్టర్ గారిదే." అంది. భార్య అన్నమాట నాగభూషణం గారు విన్నాడు.

"ఇదోటా పైగా—సంబంధం పురమాయించిందీ, ఏర్పాట్లన్నీ చేసింది మీ అన్నలూ, అక్కలూ—పీటలమీద కూర్చోడంతప్ప, నేనేమీ ఎరగను." అన్నారాయన.

దీన్నిబట్టి మీరూ, నేను, ఏమనుకోవాలి? అమ్మాయికి పెండ్లిచెయ్యమన్నది ప్రగల్భం! సంబంధాలు రావడంలేదన్న తలవొంపుని, బడాయికింద తిప్పికొట్టడం! అమ్మాయికి పెండ్లికాకపోతే, ఆ కీర్తంతా తల్లిదండ్రులకే దక్కాలి కాబోలు!

కథపూర్వకంగా చెప్పదల్చుకున్న విషయాలింకేవీ, లేవు. ప్రతి జీవితం మృత్యువుతో అంతమైనట్లే యీ కథ కూడా మృత్యువుతో అంతం కావల్సిందే.

నా చదువు చివరి సంవత్సరం: నేను పరీక్షల చదువుకోసం, స్నేహితుల గదిలోకి మకాం మార్చేశాను. పరీక్షలు ముగిసినాయి. ఆరుగంటలకి సినిమా కెళ్లి, భోజనంచేసి, బీచమ్మట నడుచుకుంటూ లాడ్జికి చేరుకునేప్పటికి పదకొండైంది. స్నేహితుడు కామత్ చెప్పాడు. నాగభూషణం గారునన్ను వెంటనే వారింటికి రమ్మని రెండుసార్లు కబురంపినట్లు. మేం మాట్లాడుకుంటుండగానే, డాక్టర్ 'కుట్టి' గారి కాంపౌండర్ కారు తీసుకొచ్చాడు. నాగభూషణం గారికి సాయంత్రం ఐదింటికి గుండెల్లో విపరీతమైన నొప్పి బైలుదేరి పడిపొయ్యాడనీ, 'కుట్టీ,' మందులిస్తున్నాడనీ చెప్పాడు కాంపౌండరు. నేనూ, కామత్ కూడా బైలుదేరాము.

మేము వెళ్లేటప్పటికి నాగభూషణం గారు నిద్రలో వున్నారు. పద్మావతమ్మగారు, పెద్దమ్మాయి, అంతా వర్ణించారు. అకస్మాత్తుగా గుండెలో నెప్పి రాగానే, ఆయన లేచి గుండెలు పట్టుకుని అటూ యిటూ పచార్లు చేసి పడిపొయ్యాడుట. ముచ్చెమట్లు పోశాయిట. రెండువాంతులు కూడా అయ్యాయి. నాలుగైదు నిముషాలు స్పృహలేకుండా పడిపోయి తరవాత మెల్లిగా లేచాడుట. అజీర్ణంవల్ల కల్గిన 'బిలియరీ కాలిక్" అనుకున్నారుట నాగభూషణం గారు. తక్షణం డాక్టర్ వాసుదేవరావ్‌కి కబురు చేశారు. ఆయన పదినిమిషాల్లో వ్యాధి 'ఎంజినా పెక్టొరీస్' అనే గుండెజబ్బుని నిర్ణయంచేసి మందులు డాక్టర్ కుట్టికి పురమాయించి వెళ్ళాడు. ఒక గాజు గొట్టంలో 'ఎమిల్ నైట్రైట్స్' వేసి చుట్టూ పట్టు గుడ్డచుట్టి పీల్చడం, నైట్రోగ్లిసెరిన్ బిళ్లలు చప్పరించడం—అంతే మందులు.

నాగభూషణంగారికి నిద్రపట్టడంలేదు. మతి భ్రమించినవానికి మల్లె అటూ యిటూ దొర్లడం, లేచి కూర్చోడం, చాలా బాధపడుతున్నాడు. కుట్టీ, నైట్రొగ్లిసరిన్, కొస్త, 'మార్ఫిన్' కలిపి ఇంజెక్షనిచ్చిం తర్వాత ఆయన మత్తుకలిగి నిద్రపొయ్యాడు. రాత్రంతా, నేనూ, పద్మావతమ్మ, వారి అల్లుడు, వేలాయుధం మేలుకొని కూర్చున్నాం. అప్పుడప్పుడు ఆయన గుండెల్లో నెప్పిఅనడం, నిద్రమత్తు కోసం, లూమినాల్, బెల్లడోనా, మొదలైనవి ఇయ్యటం అలవాటే..

తెల్లవారింది. పద్మావతమ్మగారు, వెన్ను, కడుపు, మెల్లగా రాస్తూ, మసాజ్ చేస్తూనేవున్నారు. రెండోసారి గుండెల్లో నెప్పి తొమ్మిదిగంటల కొచ్చింది. వాసుదేవరావు రాకపూర్వమే, నాగభూషణం గారు చనిపొయ్యాడు.

ఇది జరిగిన ఏడాదికే, నేను ఒక పేషంటు ట్రీట్‌మెంట్ నిమిత్తం పట్నం వొచ్చాను. పద్మావతమ్మగారి అల్లుడు హాస్పిటల్లో కనిపించి, అత్తగారికి జబ్బుగావుంది చూసిపొమ్మంటే వెళ్లాను. ఆవిడ జబ్బు గుండెక్షయ—'కార్డియాక్ అస్త్మా'—నిద్రపట్టేటప్పుడు ఆయాసం ఎక్కువవడం, శ్వాస దీర్ఘం కావడం, ఊపిరితిత్తులలో ఏదో ఆటంకం కలిగినట్లుండి నిద్రనుంచి లేచి కూర్చోడం—యివి యీ వ్యాధి చిహ్నాలు. డాక్టర్ కుట్టీ చెయ్యవల్సినవన్నీ చేస్తూనేవున్నాడు. అతని ట్రీట్‌మెంట్ నాకు నచ్చింది. నేను వెళ్లొస్తానని లేవబోగా, పద్మావతమ్మగారు కూర్చోమని సంజ్ఞ చేసింది.

"మీతో వో విషయం చెప్పాలని ఎన్నాళ్లనుంచో అనుకుంటున్నాను" అంది.

అదేమిటోనని కుతూహలం కనపర్చినా, ఆవిడ ధోరణకి భయమేసింది.

"చెప్పండి—ఫరవాలేదు."

"మీ రెవ్వరితోనూ చెప్పరుకదా!"

"ఫరవాలేదు—చెప్పండి."

"నే నింక బ్రతకను."

"మీకేమీ భయంలేదు. కార్డియోగ్రాఫ్ చూస్తే, నాకూ, కుట్టికి కూడా ఎంతో ధైర్యంగా వుంది. మీరు మాత్రం మానసికంగా ఏవిషయం గురించీ హైరాను పడగూడదు" అన్నాను.

"బ్రతికినా, బ్రదక్కపోయినా, నాకు ఎలాంటి చింతాలేదు. కాని డాక్టర్ గారి విషయం తల్చుకుంటే..." వాక్యం పూర్తిచెయ్యకుండా ఆవిడ కళ్లు చెమ్మగిల్లాయి.

"ఏంచేస్తాం—అవన్నీ మరిచి పోవాలి మీరు. మీకు అన్నివిషయాలూ తెల్సును. మీరే నలుగురికీ ధైర్యం చెప్పి సముదాయించుకోవాలి." అన్నాను, ఏదో వ్యవహార రీత్యా మాట్లాడుతూ.

"డాక్టర్ గారి జబ్బు ఏమిటంటారు?" అంది ఆవిడ.

"వాసుదేవరావు, 'ఎంజినా పెక్టొరిస్' అన్నాడు కాని, నాకు, మా స్నేహితుడు కామత్ కీ, 'కొరొనరీ త్రోంబోసిస్' అని అప్పట్లో అనుమానం కలిగిందనుకోండి. కలిగినా, మేం చేసింది, ఏమీ లేదు." అన్నాను, డాక్టర్లు అప్పట్లో చేసిన వాగ్వివాదాలను స్మరిస్తూ.

"ఎవ్వరితోనూ చెప్పకండి—డాక్టర్ గారిది సహజమైన చావుకాదు."

"అదేమిటి?"

"ఆయన ఆత్మహత్య చేసుకున్నారు."

"ఆ!..."

నా కెన్నో అడగాలనుంది. ఆవిడ కళ్లు మూసింది. మళ్లా తెరవలేదు.

* * *

ఇది తెలిసింతర్వాత, నాకు నేను క్రొత్త ప్రాముఖ్యాన్ని ఆపాదించుకున్నాను. ఎవరితోటీ పంచుకోడానికి వీల్లేని రహస్యంతో మనోతీక్షణం ఎక్కువైంది. ఆ విషయం నమ్మేటందుకు ఆధారాలు నా కేవీ కనబడకపోయినా, నమ్మాలని మాత్రం వుండేది. జీవితానుభవం అనే కత్తికి పదునట్టినట్లుగా వుంది. దాంతో ఎవర్ని పడితే వారిని నరికెయ్యొచ్చు—నరక్కపోవడంలో, శక్తి, ప్రభావం వుంటాయి.

ఎన్నోసార్లు నాగభూషణంగారి మృత్యువు నాటి విషయాలని స్మరించి చూశాను. ఆత్మహత్య నెగ్గాలంటే రెండు కావాలి: మొదటిది అవకాశం; రెండోది ప్రబలమైన కారణం.

అవకాశంబొత్తిగా లేదనడానికి వీల్లేదు. నాగభూషణం డాక్టరు; అప్పుడప్పుడు గుండెల్లో నొప్పి రావడం వుండేది. ఉపశాంతి నిమిత్తం, మార్ఫియా, వెరొనల్ మొదలయిన మత్తుపదార్థాల వాడకం వుంది. ఆ రోజు వుదయం తెల్లారకుండానే పెద్దమ్మాయి కాఫీకలపడానికి వంటింట్లోకెళ్లింది. నేను తెల్లవార్లూ మేలుకున్నట్లు యిందాకా చెప్పినా, అల్లా వోరగిలి గోడకి కాసేపైనా కునుకు తీసి వుండడం అసంభవంకాదు. నాకు బాగా జ్ఞాపకం.. ఎనిమిది గంటలకి గది వూడవడానికి పనిపిల్ల చీపురుచ్చుకొచ్చింది. గదినిండా ఇన్జెక్షన్ ట్యూబుల పగిలిన ముక్కలు, అట్టపెట్టెలు పడివున్నాయి. వాటిని వోపక్కగా చేర వెయ్యడంలో వేలాయుధం, చేతివేలుకి గాజుపెంకు గుచ్చుకుని రక్తంరావడం, కట్టుకట్టడంకోసం, ఆతను నేనూ ముందుగదిలోకి వెళ్లడం—నాకు గుర్తు. ఆ ఐదు నిముషాలలోనూ, నాగభూషణంగారు ఆత్మహత్య చేసుకొని వుండచ్చు. మరో రెండు వెరొనాల్ టేబ్లెట్సు మింగితేచాలు. లేక, వాసుదేవరావు, నిద్రకోసం క్లోరోఫారంకూడా వాడమన్నాడు—దాన్ని ఎక్కువగా వాడివుండొచ్చు. పద్మావతి చూసికూడా, తనకి ఆ మందు పర్యవసానం అర్థంగాక, వారించకపోయివుండొచ్చు; చనిపోయింతర్వాత, అర్థమైవుండొచ్చు.

ఐనా నేను నమ్మలేను. అట్లాంటిపని చేసివుంటే, లక్షణాలు బైటపడకమానవు. రెండోమారు గుండెపోటు వొచ్చినప్పుడు, ఆయనకి స్పృహవుంది. నేను చూచాను. నేను డాక్టర్ని—నాకు తెలుసు, చావుకి కారణం 'కొరొనరీ త్రోంబోసిస్' అన్నది నేనే.

వాసుదేవరావు, కుట్టి, ఘర్షణపడ్డవిషయం కూడా అదే—

ఎంజినా పెక్టోరిస్ నాలుగైదు మార్లు వొచ్చి నయంకావొచ్చు. అటుపిదప త్రాంబోసిస్ వొస్తే చావుతప్పదు.

అవకాశం సంగతి వొదిలేసి, ప్రబలమైన కారణం ఏదన్నా వుందా అంటే ఏదీ కనిపించదు. ఒకభయంకరమైన అవస్థ సంక్రమించినప్పుడు, దాన్ని ఎదుర్కొనే మార్గంకాని, మరోవిధానం కాని లేనప్పుడే ప్రాణి ఆత్మహత్య తలబెడుతుంది. ఈ రెండే మార్గాలు—వీటిల్లో ఏదో వొకదానంట ప్రయాణం చెయ్య—అన్నప్పుడు ఆత్మహత్యకి దిగరు. ఈ వొక్కటేమార్గం—కాని అటు నువ్వు పోలేవు—అన్నప్పుడే ఆత్మహత్య.

పరీక్షలో ఫేలయిన విద్యార్థికి, రెండు మార్గాలున్నాయి. మళ్లా చదివి కృతార్థుడవొచ్చు; లేకపోతే చదువు విరమించి, వుద్యోగంలోకి దిగొచ్చు. కాని వొక సినిమాస్టార్‌ని పెండ్లి చేసుకోవాలని సంకల్పించిన విద్యార్థి, ఆ సినిమాతార మరొకర్ని వివాహమాడిన విషయం తెలుసుకున్నప్పుడు, ఆత్మహత్య చేసుకున్నాడంటే—అతని దృష్టిలో అప్రబలమైన కారణమే. మరొక సినిమాతారని చేసుకుందువుగాని లేరా—అన్న వోదార్పువెక్కిరింపైమృత్యువు శరణ్యం వెదుకుతుంది. తర్కం బాగానే వుంది. కాని,

మానవహృదయం తర్కబద్ధంగా ప్రవర్తించదు. పరీక్షలో ఫేలయిన విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటాడు; సినిమా తారకోసం తహ తహ లాడిన విద్యార్థి, పక్కింటివారి సూరమ్మతో నిక్షేపంలా కాపరంచేస్తాడు.

అనారోగ్యం, రోగబాధ, భరించలేక ఆత్మహత్య చేసుకోడం లేకపోలేదు. నాగభూషణంగారు, ఆపనిచేస్తాడనుకో గలమా? పైగా ఆబాధకి వుపశాంతి వుంది. ఆయన డాక్టరు. పిల్లలు, భార్య,—యింత సంసారం వొదులుకుంటాడా?

నాకేమీ పాలుపోక, అనేక చిత్రమైన కారణాలు సృష్టించుకున్నా. ఏదీ తృప్తి నివ్వలేదు. ఒక్కొక్కమారు, సామర్‌సెట్ మాఘం, యీ విషయాన్ని ఎట్లా సమర్థిస్తాడో వూహించేవాడిని. అవూహ యీ విధంగా సాగేది.

మాఘమ్ సానుభూతి పురుషులపైనా, ద్వేషం, స్త్రీలపైనా.

స్త్రీల వంచనలకు లొంగకుండా పురుషులు వారి బారినుండి తప్పించుకుపోతారు. స్త్రీ పాత్రలకి, శరీరాలుతప్ప, మెదడు, ఊహ, మానవత్వం వుండవు. ఇవన్నీ పురుషుడిసొత్తు. స్త్రీలకి కావల్సింది. సంఘంలో పలుకుబడి, హోదా, అధికారం, వీటిని సూచించే భౌతిక పరికరాలు—అంటే కార్లు, బంగళాలు, నౌకర్లు, దుస్తులు, నగలు వగైరా. వీటిని ఏ మొగాడు ఎక్కువగా సంపాదించి పెట్టగలిగితే, ఆ మొగాడికోసం, వారు శృంగారంవలని పన్నుతారు. అందరూ యీ వేటలో కృతకృత్యులు కాలేరు అట్లాంటప్పుడు, ఏదో విధంగా, తమ అపజయానికి ప్రతీకారంగా పగసాధిస్తారు. దీనికి పురుషపాత్రలు లొంగరు. ఆ సందర్భాలలో, నిరంతరం, స్త్రీలకీ, పురుషులకీ, 'సంసారం' అనబడే సంఘర్షణ జరుగుతుంటుంది. దాని పర్యవసానం, ఎవ్వరూ నిర్ణయించలేరు. పురుషుడు గెలిచినప్పుడు, సంఘం పురోగమిస్తుంది; స్త్రీ గెలిచినప్పుడు, సంస్కృతి పతనం జరుగుతుంది.

ఈ సిద్ధాంతాల ప్రకారం, పద్మావతి దృష్టిలో, తనకి తగినభర్త కాడన్నమాట నాగభూషణం. పద్మావతి వుత్తమశ్రేణికి చెందిన సంఘంలో వ్యక్తి; తనవాళ్లంతా పెద్దపెద్ద హోదాలోనివారు. ఆమె, తలంచినట్లుగా భర్త పైకి రాలేదు. రాడని తెలుసుకుంది. ఇంక తనకి జీవితంతో నిమిత్తం దేనికి? తనకి తగినవాడు కాడని ఎన్ని విధాలుగానో, భర్తకి తెలియపర్చి వుండకపోయినా, తెలుసుకొనే అవకాశం కలగచేసివుంటుంది.

అక్కలు, చెల్లెళ్లు, సౌందర్యానికి పేరుమోగిన వాళ్లు; అందుకు నిదర్శనం, వాళ్లందరూ మంచి హోదాగల మొగాళ్లని తెచ్చుకోగలగడమే. ఆ సౌందర్యం తనకే వుందని భ్రమించి నమ్మడం, కుటుంబంపై ఎక్కువ అభిమానం వున్నవారికి ఎంతో తేలిక; పోనీ భర్త అందమైనవాడా! పెట్టుకున్న పళ్ళు. అది తీసినప్పుడెట్లా వుంటాడో లోకానికి తెలీదు, లోకం తనని గురించిన అజ్ఞానాన్ని చాలా సంపాదించుకుంది. లోకానికి జ్ఞానభిక్ష పెట్టాలి. ఎట్లా? తనకోసం తన భార్య చేసిన త్యాగానికి తను తగడని నాగభూషణం నమ్మి, ఆత్మహత్య చేసుకున్నట్లు లోకానికి తెలిస్తే, తన ఆత్మకి శాంతి. నా కా రహస్యం

చెప్పేసి, ప్రాణం విడిచింది. భార్య, భర్తద్వారా పొందిన సంక్షోభకీ, తట్టుకున్న అన్యాయానికీ, అడిగి మడిగి వుండిపోవడంలో చూపిన త్యాగానికి, నాగభూషణం సిగ్గుపడి, కుమిలి, ఆత్మహత్య చేసుకున్నాడని, లోకం అనుకుంటే, పద్మావతిలోని వ్యక్తిత్వం, ప్రత్యేకతా, విశదమై, తన మరణానంతర మేనా, విజయం సాధించిన వుత్తమ నాయికవుతుంది.

దీని ప్రకారం పద్మావతి, భర్త ఆత్మహత్య చేసుకున్న పుకారు, స్వార్థంకోసం పుట్టించిందనీ, నిజంగా అల్లా చేసుకోలేదనీ స్పష్టమౌతుంది. పాఠకుడి దృష్టిలో, ఆమె హేయమైందిగా తయారవుతుంది. మాఘమ్‌కి, స్త్రీలోకాన్ని మరోసారి పరాభవించే అవకాశం కథద్వారా చిక్కుతుంది.

ఇల్లా అనుకోడంలో తృప్తిలేకపోలేదు. ఆలోచించినకొద్దీ యిందులో ఎన్నో లోతులు, కోణాలు, శిఖరాలు గోచరమౌతాయి. మర్యాదలో, సంప్రదాయంలో వున్న కుళ్లు వింతరూపాలు దాలుస్తూంటుంది. ఆ స్వరూపాలని ప్రదర్శిస్తే కుళ్లుని కడిగినట్లేగా!

మరో సంవత్సరం గడిచింతర్వాత, ఎక్స్‌రే పరికరాలు కొనడానికి పట్నం వొచ్చాను. స్నేహితులని చూద్దామని జనరల్ హాస్పిటల్‌కి వెళ్లాను.

డాక్టర్ కృష్ణద్వారా, వేలాయుధం అంతక్రితం రోజే హాస్పిటల్ వొదిలి, కొంచెం నింపాదిగా వుంటుందనుకొని, యింటికి వెళ్లిన సంగతి తెలుసుకున్నాను. ఓసారి వెళ్లి చూసొద్దామని బైలుదేరాను. వేలాయుధం కుటుంబంలో మంచంమీద ఓ బొంత వేసుకుని దానిమీద పడుకునివున్నాడు. మరో ముసిలామె అతనికి వుపచారాలు చేస్తోంది. వేలాయుధానికి సంక్రమించిన వ్యాధి పక్షవాతం. మొదట్లో తీవ్రంగావున్నా, కొంత తగ్గి, తల, మాటిమాటికీ వణికించే "టిక్" జబ్బుగా పరిణమించింది. అతికష్టం మీద మాట్లాడ కల్గుతున్నాడు.

నాగభూషణం గారి పిల్లల విషయం మాట్లాడుకున్నాం. పెద్దమ్మాయి మొగుడు, బొంబాయిలో ఆర్. ఎ. గా పనిచేస్తున్నాడట. నాలుగోవాడు, తాతగారి దగ్గర వుంటున్నాడట. రెండో అమ్మాయికి, మేనరికం చేశారుట. మూడోపిల్ల కాన్వెంట్‌లో చదువుకుంటోందట.

వేలాయుధం వున్న గదిలో గోడకి, నాగభూషణం, పద్మావతి, చిన్నప్పుడు తీయించుకున్న ఫోటో తగిల్చివుంది. అది చూశాను. ఆ ఫోటోలో పద్మావతిని గుర్తుపట్టడం కష్టం. చాలా నాజూకుగా, ఆకర్షణీయంగా కూడా వుందనే చెప్పాలి. ఫోటోలో బాగుండే, 'ఫోటోజెనిక్' మొహం కాబోలు. నాగభూషణాన్ని గుర్తుపట్టడం మరీ కష్టం. అతను భార్యకంటె కూడా పల్చగా వున్నాడు. అదుగో, ఆ ఎత్తు కింది పళ్ళవల్ల నోరు వికృతంగా సాగారింది.

ఆత్మహత్య విషయం వేలాయుధంతో ప్రస్తావించడానికి ధైర్యం రాలేదు. ఏదేనావుంటే బైట పడుతుందని, జబ్బు విషయాలు ప్రసంగించాను.

"సరిగ్గా ఎన్నిగంటలకి పొయ్యాడో నీకు జ్ఞాపకం వుందా?"

"లేదండి."

"చనిపోయినప్పుడు, నువ్వు దగ్గరగా వుండి చూశావా?"

"లేదు కానండి...అంతకి ముందుగా నాకు తెలుసు......"

"అంటే?"

"చచ్చిపోతారని."

"ఎట్లా తెలుసు."

"ఏవిధంగా సచ్చిపొయ్యాడో నాకు తెల్సండి. కాని ఎందుకండి అవన్నీ సెప్పుకోడం"

అని మౌనంలో పడ్డాడు వేలాయుధం. వేలాయుధం మాట్లాడింది అరవ తెలుగు. హాస్యాస్పదంగా ధ్వనిస్తుందని, మామూలు తెలుగులో అతని వాక్యాలు పొందుపరుస్తున్నాను.

"ఫర్వాలేదు చెప్పు, వారిద్దరూ జీవించిలేరు."

"ఆయన మామూలుగా సావలేదండి."

"నాక్కూడా యించుమించు అట్లాంటి అనుమానం వుంది. పూర్తిగా చెప్పరాదు?" అన్నాను.

"మీ రడుగుతుండారు గనక చెబుతున్నాను. అర్కి, ఆమే చంపేసినారండి."

"ఆ!"

"అవును. నే చూశాను. కాఫీలో ఆ బిళ్ళలు వేసి యిచ్చారు. మత్తుబిళ్ళలంట— నేను చూశా

నండి, అట్నీ కలపడం, యివ్వడం-దాంతర్వాత అర గంటలో పాణం యిడిచినారు.”

నే నేమీ మాట్లాడలేకపోయ్యాను. దీని నిజానిజాలు శాస్త్రీయంగా విమర్శించే మనస్తత్వం, వాతావరణం అప్పట్లో ఏర్పడలేదు. ఐనా, వేలాయుదం చెప్పింది అబద్ధమని ఋజువు చెయ్యడానికి సంకల్పించి, అన్నింటినీ సమర్థించడం మొదలెట్టాను.

“అది మత్తుమందు—డాక్టర్ సలహాపైన నే యిచ్చింది. అందులో తప్పులేదు” అన్నాను.

“నాకూ తెల్సునండి. ఆయన అప్పుడప్పుడు పుచ్చుకుంటుంటారు. ఒక్క టేబిళ్ల. ఆ యమ్మగారు, నాలుగైదు కలిపినారు...అంతే కాదండి......”

“ఇంకా ఏం జరిగింది.”

“నా కావేశంగానూ, భయంగానూ వుండి, దడొస్తావుందండి...మందుసీసా సిల్కు రుమాల్లోకి బోర్లించి, ఆరినుదురు, కళ్లు, ముక్కు తుడిచినారండి. గుప్పుమనేతలికి, నేను దొడ్డిగుమ్మంకాడి కెళ్లిపోయినాను.”

“వేలాయుదం, నువ్వు ఆవిడని బాగా ఎరుగుదువుకదా—అంతమంచావిడ లేదనేవాడివి—ఎందుకల్లా చెసిందంటావ్ ?” అని అడిగేశాను.

“చెప్పమంటారా ? చెప్పమంటారా ?”......

అల్లా రెండుమూడుసార్లు ప్రశ్నించి, వేలాయుదం, మళ్లా మాట్లాడలేకపోయ్యాడు. పల్స్న నీరసంగావుంది. ఆయాసం ఎక్కువైంది. నేను తొందరగా హాస్పిటల్ వాన్ కి ఫోన్ చేసి అతన్ని అందులో వేసుకుని అస్పత్రిలో చేర్పించాను. ఒకటి రెండు రోజులవరకూ స్పృహ లేదట. నేను వూరికెళ్లిపోయిన నెలరోజుల్లోనే అతను చనిపోయ్యాడని తెలిసింది.

ఈ విషయాలు నిజమైతే పద్మావతి పొరబడిందనుకోవల్సివొస్తోంది. ఎందుకంటే, వేలాయుదం రహస్యం కాస్తా నాకు చెప్పేశాడు.

అందుచేత యీ అపవాదు వెయ్యడానికి వేలాయుదానికి ఏదో మంచిసాకు వుండాలి. అదేమిటో వూహించవలసిందేగాని, యిదమిద్ధమని తేల్చేటందుకు ఆధారాలేవీలేవు. భూస్వామి తత్వంపైన, కర్షకుడు—‘మజ్దూర్’ చేసే దౌర్జన్యం అనుకుందామా? కూలివాడు తనకి తెలీకుండా, యజమానులపై చూపే యీర్ష్య అందామా ? కలిమిలేములకు నిరంతరం జరిగే యుద్ధానికిది జయభేరీయా ? అదీ యిదీ కాక, సామర్ సెట్ మాఘుంకిమల్లే, యీ ప్రాచీన మానవుడికి, స్త్రీలోకంపైన ద్వేషమా ?

పద్మావతి, భర్తని హత్యచేసిందన్న నేరంలో నిజానిజాలు పాఠకులు నిర్ణయించాలి. భర్త ఆత్మహత్య చేసుకుంటాడని పద్మావతి చాలా ఆశపడింది. కాని అల్లా జరిగే సూచనలు లేనందున, తనే ఆ పని చేసేసి, ఆత్మహత్య చేసుకున్న పుకారుని లోకానికి అందజేసిందన్న వాదంలో కొంతబలం లేకపోలేదు. ఓవేళ ఆత్మహత్య చేసుకున్నాడన్న తన వాదానికి సాక్షులు కూడా అవసరం అనుకుని కాబోలు, ఆ పని కాస్తా వేలాయుదం చూస్తుండగా చేసిందేమో అనుకుంటే, మరింత బలపడుతుంది. వేలాయుదం అమాయకుడు; తనంటే భక్తిశ్రద్ధలు హెచ్చు; అతను ఒక వేళ పసికట్టినా, అతను ఎవరికీ తెలియపరిచే ఘటం కాదని ఆమెకి బాగా తెలుసు.

కారణం యేదైనా, యీ రహస్యం బైటపెట్టేటందుకు యింతకాలం వేచివుండడం దేనికి ? ఇట్లాంటి రహస్యాలు చనిపోయ్యేముందు చెబితేనే మనశ్శాంతి కల్గుతుందనగనక, పద్మావతీ, వేలాయుదం, యింతకాలం వేచివున్నారని పాఠకులు సద్దిచెబితే నే నంగీకరిస్తాను.

ఈ వాదంలో ప్రయోజనం నాకేమీ కనబడలేదు. మాఘమ్ సానుభూతి నాగభూషణంపైనా, పాఠకుల సానుభూతి వేలాయుదంపైనావుండి, యిద్దరూ పద్మావతిని చులకనచేసి ద్వేషిస్తే, కళానుగుణ్యంగా విలువలేకపోయినా, కథకి సాంఘిక ప్రయోజనం దొరుకుతుంది. సంప్రదాయానికి లొంగిపోయిన వ్యక్తులు, ప్రజాస్వామ్యంలో వ్యక్తిత్వ ప్రకర్షకి అవకాశం లేకపోవడంవల్ల, కుతంత్రం సాగించి జీవితాన్ని మలినం చేసుకుంటారుకాబట్టి, అసాధారణ వ్యక్తులకింద ఆచారంపై విప్లవంచేసిన ప్రయోజకులకు స్థానం కల్పించి, గౌరవించే వాతావరణం కల్పించే విధి ప్రభుత్వానికీ, పాలకులకీ వుందని యీ కథలోని నీతి.

ఇల్లా ‘నీతిని’ కథ ప్రయోజనాన్ని పాఠకుడి మొహానకొట్టి తబ్బిబ్బు చెయ్యడం, ఆధునిక తత్వం కాదనుకుంటాను. రాగద్వేషాలతో నిమిత్తం లేకుండా వ్యక్తుల ప్రవర్తన, పరిస్థితులకు అతీతం కానిదిగా, త్రాసులో తూచి చూపడం వుద్దేశంగా పెట్టుకున్న నేను, ఆత్మహత్యకీ, హత్యకీ అంగీకరించను. నాగభూషణంగారిది సహజమైన మరణమేనన్న నా నమ్మకానికి ఋజువు యీ కథని యింకా పెంచలేకపోవడంలో వుందనుకుంటాను.